సాక్షి
ఏలూరు

శుక్రవారం। 4। ఆగస్టు। 2023



ట్రిపుల్‌ఐటీ ప్రవేశాలకు..

నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో మిగిలిన సీట్ల భర్తీకి శుక్రవారం రెండో జాబితాను విడుదల చేయనున్నారు. 8లో ▸



వలంటీర్ల సేవలు భళా

వలంటీర్లు అంకితభావంతో సేవలందిస్తున్నారు. లబ్ధిదారులు స్థానికంగా లేకున్నా వారి వద్దకే స్వయంగా వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. 8లో ▸



చురుగ్గా పారిశుద్ధ్య పనులు

నరసాపురం రూరల్: కొత్తనవరసపురం ఎస్టీకాలనీలో వరద నీరు పూర్తిగా తగ్గడంతో గురువారం ఈవోపీఆర్డీ ఆంజనేయశర్మ పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

న్యూస్‌రీల్

ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లకు సన్నాహాలు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ సత్యనారాయణ

బుట్టాయగూడెం: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఈనెల 9న కేఆర్‌పురం ఐటీడీఏలో ఘనంగా నిర్వహించేందుకు ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ జీవీవీ సత్యనారాయణ సన్నాహాలు చేస్తున్నారు. గురువారం పీఓ చాంబర్‌లో ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై ప్రజాసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆదివాసీ దినోత్సవ నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. ఇదిలా ఉండగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో పీఓ సత్యనారాయణకు ఆ సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఏపీఓ పీవీఎస్ నాయుడు, వెలుగు ఏపీడీ నాగేశ్వరరావు, పీఎంఆర్‌సీ ఏఎంఓ శిరమయ్య, ఐటీడీఏ మేనేజర్ ప్రకాష్, జేఏసీ నాయకులు మొడియం శ్రీనివాస్, కుర్సం దుర్గారావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు మొడియం గంగరాజు పాల్గొన్నారు.

తొలిరోజు 18,225 మందికి సంపూర్ణ పోషణ కిట్లు

ఏలూరు (టూటౌన్): ఏలూరు రీజియన్‌లోని ఏడు జిల్లాల్లో 63 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో టేక్ హోం రేషన్ పథకం ద్వారా తొలిరోజు 18,225 మందికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేసినట్టు మహిళా శిశు సంక్షేమ శాఖ రీజినల్ ఆర్గనైజర్ వందనపు సాయిబాల పద్మ ఓ ప్రకటనలో తెలిపారు. రీజియన్ పరిధిలో 1,27,137 మంది లబ్ధిదారులు ఉన్నారని పేర్కొన్నారు. టేక్ హోం రేషన్‌గా మూడు కిలోల నాణ్యమైన బియ్యం, కిలో కందిపప్పు, అరలీటరు పామాయిల్, ఐదు లీటర్ల పాలు, రెండు కిలోల రాగిపిండి, కిలో అటుకులు, పావు కిలో బెల్లం, పావుకిలో వేరుశనగ చిక్కీ, పావుకిలో కర్జూరం, 25 కోడిగుడ్లు అందించారని తెలిపారు. గిరిజన మండలాల్లో అదనంగా రెండు కిలోల మల్టీ గ్రెయిన్ ఆటా, పావుకిలో వేరుశనగ చిక్కీ, పావుకిలో బెల్లం అందజేశారని పేర్కొన్నారు. పిల్లలకు బాలామృతాన్ని కూడా అందించారని తెలిపారు. మాతా శిశు మరణాలు, తల్లులకు రక్తహీనత తగ్గించడం పథకం ముఖ్య ఉద్దేశమని ఆమె వివరించారు.

1,486 క్వింటాళ్ల బియ్యం పంపిణీ

ఏలూరు(మెట్రో): జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 6,326 వరద బాధిత కుటుంబాలకు గాను 5,947 (95 శాతం) కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. మొత్తం 1486.75 క్వింటాళ్ల బియ్యం, 6,058 కిలోల కందిపప్పు, 6,058 లీటర్ల వంట నూనె పంపిణీ చేశామన్నారు. మిగిలిన 379 బాధిత కుటుంబాలకు త్వరితగతిన సరుకులు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే 5,947 కుటుంబాలకు కూరగాయల కిట్లు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు అందించామన్నారు. 2,350 లీటర్ల పాలు సరఫరా చేశామన్నారు. 1,494 కుటుంబాలకు రూ.2 వేలు, 103 మందికి రూ.1,000 చొప్పున ఆర్థిక సాయం అందించామని తెలిపారు.

పోలీసుల బాహాబాహీ

ఏలూరు టౌన్: నగరంలోని పాతబస్టాండ్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుల్ బాహాబాహీకి దిగడం చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా ఉన్నాయి.. ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ వాహనాలు ఆపి జరిమానాలు విధిస్తున్నారు. అదేసమయంలో తూర్పుగోదావరి జిల్లా సమిశ్రగూడెంలో పని చేస్తున్న మహిళా కానిస్టేబుల్ తన బంధువుతో కలిసి మోటారు సైకిల్‌పై వెళుతున్నారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆమెను ఆపుతుండగా తాను కానిస్టేబుల్ అని చెప్పగా ఐడీ కార్డు చూపించాలనీ, లేకుంటే బండి కదలనివ్వనని అన్నారు. అలాగే ట్రాఫిక్ కానిస్టేబుల్ మోటారు సైకిల్ తాళాలు తీసుకునే ప్రయత్నం చేయగా మహిళా కానిస్టేబుల్ అతడి చేతిని పక్కకు తోసింది. వెంటనే ఆగ్రహంతో ఊగిపోయిన ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆమె మూతిపై కొట్టటంతో రక్తం వచ్చిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మహిళా కానిస్టేబుల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయబోతుండగా కొందరు అధికారులు, నాయకులు వారి మధ్య సయోధ్య కుదిర్చినట్టు తెలిసింది.

తమ్మిలేరు నుంచి నీరు విడుదల

చాట్రాయి: తమ్మిలేరు రిజర్వాయర్‌తో మండలంలోని పంట పొలాలకు మేలు కలుగుతుందని పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ అన్నారు. మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ గోనెల వాగు నుంచి రైతులతో కలసి ఆయన గురువారం సాగునీరు విడుదల చేశారు. రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు ఉందన్నారు.

పోషణ.. ఆరోగ్య సంరక్షణ

ఇంటికే పోషకాహారం

- గర్భిణులు, బాలింతలకు వరం
- జిల్లాలో 21,555 మందికి మేలు
- నెలకు రూ.1.97 కోట్ల వ్యయం



కైకలూరులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న దృశ్యం



కిట్‌లో సరుకులు

కైకలూరు: రాష్ట్రంలో గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ, ప్లస్, టేక్ హోమ్ రేషన్ పంపిణీ' మన్ననలు పొందుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పౌష్టికాహారం తీసుకోవడంలో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలియడంతో నేరుగా 10 రకాల పౌష్టికాహార పదార్థాలతో కూడిన సరుకుల సంచిని గర్భిణులు, బాలింతల ఇంటికే పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ముఖ ఆధారిత గుర్తింపు పద్ధతిలో సరుకుల సరఫరా పారదర్శకంగా సాగుతోంది. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు నేరుగా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి సరుకుల కిట్లు అందిస్తున్నారు.

రక్తహీనత నివారణకు..

రక్తహీనత, పౌష్టికాహారలేమితో గర్భిణులు, బాలింతలు ఎవ్వరూ ఉండకూడదనే ఉద్దేశంతో సీఎం జగన్ టేక్ హోం రేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద కిట్ విలువ రూ.850, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కింద గిరిజన ప్రాంత మహిళలకు కిట్ విలువ రూ.1,150 అందిస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ఇంత పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్న దాఖలాలు లేవు. అలాగే గ్రామాల్లో వైద్య సేవలు అందించే ఫ్యామిలీ డాక్టర్లు ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల్లో పర్యటించాలని సీఎం జగన్ నిర్ణయంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన మండలాల్లో అదనంగా..

జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీల పరిధిలో 11,826 మంది గర్భిణులు, 9,729 మంది బాలింతలు మొత్తం 21,555 మంది ఉన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద రూ.850 కిట్లు తీసుకునే 16,853 మందికి నెలకు రూ.1,43,250,50, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కింద గిరిజన ప్రాంతాల్లోని కిట్లు తీసుకునే 4,702 మందికి కిట్ రూ.1,150 చొప్పున రూ.54,07,300 మొత్తం రూ.1,97,32,350 ఖర్చు ప్రభుత్వం భరిస్తోంది.

నాణ్యతలో రాజీపడలేదు

నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా సీఎం జగన్ 10 రకాల పోషక పదార్థాలను అందిస్తున్నారు. ఒక్కో కిట్‌లో మూడు కిలోల నాణ్యమైన బియ్యం, కిలో కందిపప్పు, అరలీటరు పామాయిల్, ఐదు లీటర్ల పాలు, రెండు కిలోల రాగిపిండి, కిలో అటుకులు, పావు కిలో బెల్లం, పావు కిలో వేరుశనగ చిక్కీలు, పావు కిలో కర్జూరం, 25 కోడిగుడ్లు (13 గుడ్లు ఒకసారి, 12 గుడ్లు మరోసారి) అందిస్తారు. గిరిజన మండలాల్లో అదనంగా రెండు కిలోల మల్టీ గ్రెన్ ఆటా, పావు కిలో వేరుశనగ చిక్కీ, పావు కిలో బెల్లం ఇస్తున్నారు. జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి కిట్ల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. త్వరలో ఏలూరు జిల్లావ్యాప్తంగా రేషన్ బియ్యంతో తయారు చేసే వంటకాలపై పోటీలు నిర్వహించి అవగాహన కల్పించనున్నారు.

శుభ పరిణామం



అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పౌష్టికాహారాన్ని తీసుకునే వాళ్లం. ఒక్కోసారి వివిధ కారణాల వల్ల కేంద్రాలకు వెళ్లలేక పోయేవాళ్లం. సమయం మించిపోతే పదార్థాలు చల్లబడేవి. ఇప్పుడు ఏ బాధా లేకుండా ఇంటి వద్దకే పోషకాహార కిట్లు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ కృతజ్ఞతగా ఉంటాం.

– పి.రజని, బాలింత, కైకలూరు

పారదర్శకంగా పంపిణీ



రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలకు సీఎం జగన్ విలువైన పోషకాహారం కిట్లు అందిస్తున్నారు. వీటిని పారదర్శకంగా పంపిణీ చేసేందుకు ముఖ ఆధారిత పద్ధతిని అందుబాటులోకి తీసుకొచ్చాం. ఇప్పటికే జిల్లాలో పలువురు లబ్ధిదారులకు వారి ఇంటి వద్దనే కిట్లు పంపిణీ చేశాం.

– కేపీఎల్ పద్మావతి, జిల్లా మహిళా, శిశుసంక్షేమశాఖాధికారి, ఏలూరు

డీఈఓ బృందానికి ప్రథమ స్థానం



మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి బహుమతి అందుకుంటున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విజయవాడలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్ నేతృత్వంలోని బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు వివరాలను డీఈఓ కార్యాలయం నుంచి విడుదల చేశారు. విజయవాడలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈజ్ ఆఫ్ లివింగ్, గుడ్ గవర్నెన్స్ అనే అంశంపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో 6 అంశాలపై రైటప్స్ రూపొందించడంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఏలూరు డీఈఓ నేతృత్వంలోని బృందానికి ప్రథమ స్థానం లభించింది. జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఎ.సర్వేశ్వరరావు, రాఘవాపురం హైస్కూల్ హెచ్ఎం కె.రామకృష్ణ, నలుగురు అవార్డీ టీచర్లు పాల్గొన్నారు.

భీమవరం కమిషనర్‌గా శ్యామల

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపాలిటీ రెగ్యులర్ కమిషనర్‌గా ఎస్.శ్యామల గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె అధికారులు, సిబ్బందితో సమావేశమై సూచనలు, సలహాలు అందించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



వేలేరుపాడు: సాయం అందిస్తున్న తహసీల్దార్



కుక్కునూరు: కివ్వాకలో సాయం అందిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: మండలంలోని 35 గ్రామాల్లో వరద పునరావాస సహాయం కింద 3,742 మంది కుటుంబాలకు రూ.68.93 లక్షల పంపిణీ చురుగ్గా సాగుతోంది. గురువారం రుద్రంకోటలో ఆర్థిక సహాయం పంపిణీని ఆర్డీఓ ఝాన్సీరాణి పరిశీలించారు. ఒక్కరు ఉన్న కుటుంబానికి రూ.1,000, ఇద్దరు అంతకు మించి ఉంటే రూ.2 వేలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పునరావాసం అందిస్తామన్నారు. అలాగే తాట్కూరుగొమ్ము పంచాయతీ పరిధిలోని సుద్దగుంపు, శ్రీరాంపురం గ్రామాల్లో బాధితులకు తహసీల్దార్ కె.చల్లన్నదొర ఆర్థిక సాయం అందించారు. ఇప్పటివరకు బాధితులకు 1,486 కిలోల బియ్యం, 6,058 కిలోల కందిపప్పు, 6,058 లీటర్ల వంట నూనె పంపిణీ చేశామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కె.లక్ష్మీదేవి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, ఎంపీటీసీ కొమ్మరాజు రాంబాబు, ఎంపీడీఓ శ్రీహరి, వైఎస్సార్ సీపీ నేత కామినేని వెంకటేశ్వరరావు, రేపాకగొమ్ము సర్పంచ్ సోడే వెంకమ్మ, వైస్ ఎంపీపీ కేసగాని వెంకటేశ్వరమ్మ, పార్టీ మండల కన్వీనర్ కె.శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో..

కుక్కునూరు: మండలంలో వరద బాధితులకు అధికారులు నగదు సాయం చేశారు. మండలంలోని ఐదు పునరావాస కేంద్రాల్లో ఉన్న 2,584 బాధితులకు పరిహారం అందించనున్నారు. ఈ కార్యక్రమం పర్యవేక్షణకు ఇతర మండలాల తహసీల్దార్లను ప్రభుత్వం ఇన్‌చార్జిలుగా నియమించింది. కివ్వాక పునరావాస కేంద్రంలో బాధితులకు ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, టి.నరసాపురం తహసీల్దార్ జేవీ సుబ్బారావు నగదు అందజేశారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పినిపే విశ్వరూప్, పాల్గొన్న నూజివీడు ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

ఏలూరు(మెట్రో): పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను అర్హులందరికీ అందించేలా అధికారులు కృషిచేయాలని రాష్ట్ర రవాణా శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం నూజివీడు నియోజకవర్గంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాల స్థాయిని పెంచేలా నవరత్నాల కార్యక్రమం కింద ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగిరపర్చాలని, జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పన పనులు పూర్తిచేయాలని సూచించారు. నూజివీడు నియోజకవర్గంలో 12 గ్రామాల్లో నివాస యోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు అందించారని, లబ్ధిదారులు విముఖత చూపిస్తున్నారని ఎమ్మెల్యే అప్పారావు మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటి స్థానంలో ప్రత్యామ్నాయ భూములను గుర్తించాలని అధికారులను మంత్రి విశ్వరూప్ ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్ రెండో విడత పనులకు టెండర్ల ప్రక్రియను ఈనెల 15లోపు పూర్తిచేయాలన్నారు. నూజివీడు నియోజకవర్గంలో 76 గ్రామ సచివాలయ, 77 రైతు భరోసా కేంద్రాలు, 66 హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులను వచ్చే నెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు. 84 పాఠశాలలకు సంబంధించి 99 నాడు–నేడు పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 136 పనులకు రూ.6.23 కోట్లు మంజూరు చేశామన్నారు. భూ సర్వే, రోడ్ల మరమ్మతులు, టిడ్కో ఇళ్లు, జలకళ బోర్లు, రైతులకు ఉచిత విద్యుత్‌పై సూచనలు ఇచ్చారు.

12,400 మందికి ఇంటి పట్టాలు : జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో రెండో విడత రీ సర్వే పనులను గడువులోపు పూర్తిచేస్తామన్నారు. 12,400 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశామన్నారు.

రూ.25 కోట్లతో రింగ్ రోడ్డు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ నూజివీడులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సీఎం జగన్ రూ.25 కోట్లతో రింగ్ రోడ్డు మంజూరు చేశారని, పనులు సత్వరమే చేపట్టాలని కోరారు. నూజివీడు శివారులోని కుక్కలతండాలో నివసిస్తున్న షెడ్యూల్డ్ తెగల కుటుంబాలకు ఇళ్ల స్థల పట్టాలు ఇవ్వాలని కోరారు. సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డ్వామా పీడీ రాము తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

నియోజకవర్గాల స్థాయిలో సమస్యలను గుర్తించి, పరిష్కరించడం నియోజకవర్గ సమీక్షల ముఖ్య ఉద్దేశమని మంత్రి విశ్వరూప్ అన్నారు. సమీక్ష అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. నూజివీడులో రింగ్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ, పనులను ఆదేశాలిచ్చామన్నారు. ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి విశ్వరూప్ అన్నారు.

తల్లిపాలు.. బిడ్డకు మేలు

అమ్మపాలు.. అమృతం

- 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు
- వాడవాడలా అవగాహన ర్యాలీలు, సదస్సులు
- తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యం



భీమడోలు మండలం గుండుగొలనులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

భీమడోలు: తల్లి పాలు అమృతతుల్యం.. తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు కీలకం.. తల్లి పాల విశిష్టతను తెలియజేసేలా ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఉద్యోగులైన తల్లిదండ్రులు తమ పిల్లలకు తల్లిపాలు కొనసాగించాలన్న నినాదంతో ఈ ఏడాది వారోత్సవాలను ప్రారంభించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు తమ పిల్లలకు పాలివ్వడానికి ఒక ప్రత్యేక గదిని ఏర్పాటుచేయాలని ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. అలాగే గర్భిణులు, బాలింతలకు మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల విశిష్టతను తెలియజేసేలా వాడవాడగా అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నారు. పోషకాహారం ప్రాముఖ్యతను తెలియజేయడంతో పాటు తల్లి పాల గొప్పతనాన్ని వివరిస్తున్నారు. అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మాతా శిశు మరణాలు గణనీయంగా తగ్గించేందుకు, సంపూర్ణ ఆర్యోగానికి తల్లి పాలు శ్రేయస్కరమని ప్రచారం చేస్తున్నారు.

ఔషధ గుణాలెన్నో..

తల్లి పాల ద్వారా బిడ్డకు ఖనిజాలు, మాంసపుకృత్తులు, ప్రొటీన్లు, విటమిన్లు పుష్కలంగా అందుతాయి. ముర్రిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక టీకాగా పనిచేస్తుంది. అలాగే శిశువుకు కామెర్లు, టైఫాయిడ్, మలేరియా, డయేరియా వంటి రోగాలు దరిచేరవు. బిడ్డ బరువు పెరిగేందుకు దోహదపడతాయి. పగలు కన్నా రాత్రి సమయంలో పాలివ్వడం ద్వారా బిడ్డ ఎదుగుదల బాగుంటుందని వైద్యులు సూచిస్తున్నారు. బిడ్డకు బుద్ధిమాంద్యం, మానసిక రుగ్మతలు దరి చేరే అవకాశాలు తక్కువ. ఇటువంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా 13 శాతం శిశుమరణాలు తగ్గుతాయని అధ్యయనాల్లో తేలింది.

జాగ్రత్తలు తప్పనిసరి

- పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలి.
- పగలు, రాత్రి వేళల్లో బిడ్డను తల్లివద్దే ఉంచాలి.
- మొదట్లో రోజుకు 8 నుంచి 12 సార్లు శిశువుకు చనుబాలివ్వాలి.
- రాత్రిళ్లు కూడా క్రమ పద్ధతిలో తల్లిపాలివ్వాలి.

ఏలూరు జిల్లా	
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	10
అంగన్‌వాడీ కేంద్రాలు	2,225
గర్భిణులు, బాలింతలు	19,056
తల్లి పాలలో పోషకాలు	
నీరు	87 శాతం
కొవ్వు	4.2 శాతం
ప్రొటీన్లు	1.1 శాతం
కార్బోహైడ్రేడ్లు	7.0 శాతం
కాల్షియం	0.03 శాతం
ఫాస్పరస్	0.014 శాతం
సోడియం	0.015 శాతం
పొటాషియం	0.055 శాతం
క్లోరిన్	0.043 శాతం

ప్రయోజనాలెన్నో..

ఆరు నెలలపాటు బిడ్డకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలి. దీనిద్వారా తల్లికి రొమ్ము, గర్భసంచి, అండాశయ క్యాన్సర్లు రాకుండా నివారించవచ్చు. బిడ్డలో రోగనిరోధకశక్తి పెరిగి రెండేళ్ల వరకు మొదడు ఎదుగుదల ఉంటుంది. వెయ్యి రోజుల్లో తల్లి పాలతో పాటు బలవర్థక పోష్టికాహారం అందించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది.

రోగ నియంత్రణకు దోహదం



పుట్టిన బిడ్డకు ఆరు నెలలపాటు విధిగా తల్లిపాలు ఇవ్వాలి. దీనిద్వారా తల్లీబిడ్డకు రోగనియంత్రణ శక్తి పెరుగుతుంది. రోజులో బిడ్డకు 10 నుంచి 12 సార్లు పాలు పట్టాలి. అలాగే ఎక్కువ సార్లు మూత్రపోస్తుంటే బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్టు గుర్తించాలి. తల్లిపాలు ఇవ్వడంతో బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో పాటు మహిళలకు బ్రెస్ట్, అండాశయ క్యాన్సర్లు రావు.

– ఆల్బర్ట్, చిన్నపిల్లల వైద్యులు, భీమడోలు సీహెచ్‌సీ

శారీరక, మానసిక ఆరోగ్యానికి..



తల్లి పాలతో బిడ్డ శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. తల్లిపాల విశిష్టతను తెలిపేలా విస్తృత ప్రచారం చేస్తున్నాం. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాయాల్లో తల్లులు తమ పిల్లలకు పాలు పట్టివ్వడానికి ఓ గదిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నాం.

– కేపీఎల్ పద్మావతి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్, ఏలూరు

పక్కాగా వరద సహాయక చర్యలు



ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఏలూరు(మెట్రో): వరద సహాయ పునరావాస కార్యక్రమాల ద్వారా తమను కలెక్టర్లు బాగా చూసుకున్నారనే మాట బాధితుల నుంచి వినిపించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎన్నికల సంఘ సమావేశానికి వెళ్లిన కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ విశాఖ నుంచి, ఏలూరు కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, జిల్లా ఎస్పీ మేరి ప్రశాంతి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఇన్‌చార్జి డీఆర్ఓ కె.పెంచల కిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ విమర్శలకు తావులేకుండా సహాయ, పునరావాస కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వరద బాధిత కుటుంబాలందరికీ సాయం అందించాలని, నేను నష్టపోయానని కాని.. నాకు ప్రభుత్వ సాయం అందలేదని గాని ఒక్క ఫిర్యాదు కూడా అందకూడదన్నారు. వరద నీరు తగ్గిన తర్వాత నష్టం అంచనాలు సిద్ధం చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని వారికి ఇళ్లను మంజూరు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు. పోలవరం ఎగువన తరచూ ముంపునకు గురయ్యే ప్రాంతాలకు ఆర్అండ్ఆర్ కార్యక్రమాల్లో ప్రాధాన్యమివ్వాలన్నారు.

క్లుప్తంగా

భర్త, అత్తమామలపై కేసు

భీమడోలు: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తమామలపై ఓ వివాహిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై చావా సురేష్‌కుమార్ గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పూళ్లకు చెందిన గెడ్డం సహదేవుడుతో ద్వారకాతిరుమల మండలం వెంకటకృష్ణాపురానికి చెందిన స్వప్నకు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి పిల్లలు కలగలేదు. దీంతో భర్త గెడ్డం సహదేవుడు తాను వేరే పెళ్లి చేసుకుంటానని, అదనపు కట్నం తేవాలని చెప్పి భార్య స్వప్నను పుట్టింటి వద్ద వదిలేశాడు. దీంతో స్వప్న పోలీసులను ఆశ్రయించగా, ఆమె ఫిర్యాదు మేరకు భర్త సహదేవుడు, అత్త గొంతెమ్మ, మామ బాలరాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రుణాలిస్తామంటూ టోకరా

ముదినేపల్లి రూరల్: రుణాలిస్తామంటూ పలువురి నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన సంస్థపై బాధితులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఆటోనగర్‌లో ఒక ఇంటిని కొందరు అద్దెకు తీసుకుని హోంఫైనాన్స్ పేరిట కార్యాలయాన్ని ప్రారంభించారు. ఒకొక్కరి నుంచి ఆధార్ కార్డు ఆధారంగా రూ.5 వేలు కట్టించుకుని కేవలం 70 పైసల వడ్డీకే రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు ఇస్తామని నమ్మబలికారు. ఈ విధంగా 15 రోజుల క్రితం కొందరి నుంచి డబ్బులు వసూలు చేశారు. తరువాత రుణాల గురించి ఆరా తీస్తే సంబంధిత వ్యక్తులెవ్వరూ కార్యాలయంలో కనిపించక పోవడంతో పాటు ఫోన్లు స్విచాఫ్ చేసినట్లు మండలంలోని పెయ్యేరుకు చెందిన బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంస్థ మండలంలోని వడాలి, వణుదుర్రు, కొరగుంటపాలెం, గురజ తదితర గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారుల నుంచి కూడా ఇదే తరహాలో రుణాలిస్తామంటూ డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆపద వేళ.. వలంటీర్ల సేవలు భళా

'జగనన్న మాపై ఉంచిన నమ్మకంతో మాపై పెట్టిన బాధ్యతను ఎన్ని కష్టాలు, ఇబ్బందులు ఎదురైనా ముందడుగు వేస్తాం' అంటున్నారు వలంటీర్లు. ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చిందంటే లబ్ధిదారులు ఎక్కడ, ఏ పరిస్థితుల్లో, ఎంత దూరంలో ఉన్నా వలంటీర్లు ఆయా ప్రాంతాలకు వెళ్లి లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేస్తూ తమ సేవాగుణాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం అందించే పింఛన్ ఏదోక రూపంలో వారికి ఆర్థిక అవసరాలకు ఉపయోగపడుతుందనే భావనతో ప్రయాణం కష్టమైనా వలంటీర్లు వెనుకడుగు వేయడం లేదు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ సేవలను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. గతంలో పంచాయతీ కార్యాలయానికి వెళ్లి గంటల తరబడి క్యూలో నిరీక్షించి పింఛను సొమ్ము తీసుకునేవారమని, కానీ వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇప్పుడు ఎక్కడ ఉన్నా చెంతకే వలంటీర్లు వచ్చి మరీ పింఛన్ సొమ్ము ఇస్తున్నారని, వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.


ఏలూరులో భీమవరపు శేషుకు పింఛను అందిస్తున్న వలంటీర్ సవలం నాగవీరవెంకట సత్యనారాయణ


భీమవరం ఆసుపత్రిలో రూతమ్మకు పింఛన్ ఇస్తున్న ఎన్నార్పీ అగ్రహారం వలంటీర్ మమత


పెద్దేవంలో యర్రమల్లి అమ్మాజీకి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ వెంకటరమణ


భీమవరం ఆసుపత్రిలో మునగాల కుమారికి పింఛను అందిస్తున్న వలంటీర్ పాపారావు


కంసాలిపాలెంలో వృద్ధురాలు నాగరత్నంకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ దుర్గ

- దూరంగా ఉన్నా.. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా పింఛన్ల అందజేత
- వలంటీర్ల సేవలను ప్రశంసిస్తున్న లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు

ఉండి : ఉణుదుర్రుకు చెందిన దివ్యాంగుడు చిటికెన గాంధీ అనారోగ్యంతో గత కొంతకాలంగా ఏలూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ యు.లిల్లీరోజా గురువారం ఏలూరు వెళ్లి గాంధీకి పింఛను సొమ్ము అందించింది. అలాగే మహదేవపట్నంకు చెందిన మునగాల కుమారి కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తున్న పింఛను సొమ్ము రూ.10 వేలు ఆమెకు ఎంతో ఆసరాగా ఉంటోంది. కొద్దిరోజులుగా భీమవరంలో చికిత్స పొంది మెరుగైన చికిత్స కోసం కాకినాడ ఆస్పత్రిలో చేరింది. ఆమె ఎక్కడుంటే అక్కడకు వెళ్లి ప్రతి నెలా వలంటీర్ ఎస్.ప్రసాద్ పింఛను సొమ్ము అందిస్తున్నారు. గురువారం ప్రసాద్ పింఛను సొమ్ము అందించడంతో అతనికి కృతజ్ఞతలు తెలిపింది. అదేవిధంగా ఎన్నార్పీ అగ్రహారానికి చెందిన దేశాబత్తుల రూతమ్మ కొద్దిరోజులుగా అనారోగ్యం కారణంగా భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వలంటీర్ ముళ్లగిరి మమత గురువారం ఆస్పత్రికి వెళ్లి రూతమ్మ పింఛను సొమ్ము అందించింది.


ఏలూరు ఆసుపత్రిలో చిటికెన గాంధీకి పింఛను అందిస్తున్న ఉణుదుర్రు వలంటీర్ లిల్లీరోజా


నరసాపురం ఆసుపత్రిలో నాగేశ్వరరావుకు పింఛన్ సొమ్ము ఇస్తున్న వలంటీర్ సుబ్బలక్ష్మి

వృద్ధులకు ఆసరాగా..

మొగల్తూరు : పంచాయతీ నక్కావారిపాలెంకు చెందిన కవురు నాగేశ్వరరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రతి నెలా పింఛను అందజేసే వలంటీర్ ఇంజేటి సుబ్బలక్ష్మి నరసాపురం ఆసుపత్రిలో నాగేశ్వరరావు చికిత్స పొందుతున్నట్లు తెలుసుకుంది. గురువారం ఆసుపత్రికి వెళ్లి వృద్ధాప్య పింఛను అందజేసింది.

పెద్దేవంలో కుమార్తె ఇంటికి వెళ్లి..

పోలవరం రూరల్ : పోలవరం గ్రామానికి చెందిన యర్రమల్లి అమ్మాజీ అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకున్న అనంతరం పెద్దేవం గ్రామంలో కుమార్తె వద్ద ఉంటోంది. ఈమెకు పోలవరం-1 సచివాలయం వలంటీర్ ముంగర వెంకట రమణ గురువారం పెద్దేవం వెళ్లి ఆమెకు వృద్ధాప్య పింఛను అందజేశారు.

ఏలూరు ఆస్పత్రికి వెళ్లి..


భీమడోలు : భీమడోలులో భీమవరపు శేషు అనే వృద్ధుడు తనకు కాళ్లకు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని అక్కడే వార్డులో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ సవలం నాగవీర వెంకట సత్యనారాయణ విషయం తెలుసుకుని గురువారం ఏలూరు ఆసుపత్రికి వెళ్లి శేషుకు వృద్ధాప్య పింఛను సొమ్ము అందించాడు.

కంసాలిపాలెం వెళ్లి..

తణుకు : ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు గ్రామానికి చెందిన వృద్ధురాలు గాలింకి నాగరత్నం అనారోగ్యం కారణంగా ఇటీవల నిడదవోలు మండలం కంసాలిపాలెంలోని తన కుమార్తె ఇంటికి వెళ్లింది. విషయం తెలుసుకున్న వలంటీర్ కె.దుర్గ గురువారం కంసాలిపాలెం వెళ్లి నాగరత్నంకు పింఛను సొమ్మును అందించింది.

ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు నేడు రెండో జాబితా విడుదల

నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలకు సంబంధించి తొలి విడత నిర్వహించిన కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి గాను శుక్రవారం రెండో జాబితాను విడుదల చేయనున్నట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్వీ గోపాలరాజు గురువారం తెలిపారు. ఉదయం పది గంటలకు యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో ఎంపిక జాబితాను ఉంచుతామని, జాబితాలో ఉన్న అభ్యర్థులు కాల్ లెటర్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అంతేగాకుండా ఎంపిక జాబితాలో ఉన్న అభ్యర్థులకు ఎస్ఎంఎస్‌లు, మెయిల్‌కు మెసేజ్ పంపించడం జరుగుతుందన్నారు. మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయిన అనంతరం నాలుగు ట్రిపుల్ ఐటీల్లో కలిపి మొత్తం 765 సీట్లు మిగిలిన నేపథ్యంలో ఈ సీట్ల భర్తీకి గాను రెండో విడత కౌన్సెలింగ్‌ను ఈ నెల 9, 10 తేదీల్లో నాలుగు ట్రిపుల్ ఐటీలకు కలిపి నూజివీడు ట్రిపుల్ ఐటీలోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అలాగే ఈ నెల 11న నుంచి అన్ని ట్రిపుల్ ఐటీల్లో పీయూసీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.



పేదలకు సంక్షేమం దక్కకుండా అడ్డుకుంటున్నారు

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


వేల్పూరులో బీసీల ఆత్మగౌరవ సభలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: రాష్ట్రంలో టీడీపీ నాయకులు పేదలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందకుండా రాష్ట్రవ్యాప్తంగా కోర్టులలో 22 వేల కేసులు వేసి అడ్డుకుంటున్నారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం రాత్రి తణుకు రూరల్ మండలం వేల్పూరులో నిర్వహించిన బీసీ కులాల ఆత్మ గౌరవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సభకు గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్ అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ వేల్పూరులో గత 30 ఏళ్లగా ఎవరి ఓట్లతో రాజకీయ జీవితాన్ని అనుభవించారో వారే నేడు బీసీల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను నిలుపుదలే చేసేలా కోర్టులకెళ్లి స్టేలు తీసుకొచ్చారన్నారు. టీడీపీ నాయకులు రాష్ట్రంలో బీసీలను ఓట్లేసే యంత్రాలుగానే వాడుకున్నారే తప్ప వారి అభివృద్ధికి ఏమీ చేయలేదన్నారు. గ్రామంలోని బీసీలకు సొంతంగా కమ్యూనిటీ హాళ్లు నిర్మించుకుంటే స్థానిక టీడీపీ నాయకులు ఈర్షతో అడ్డుకుంటున్నారని చెప్పారు.

ఒక్క వేల్పూరులోనే రూ.1500 కోట్ల దోపిడీ

గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన వేల్పూరుకు చెందిన ఆరిమిల్లి రాధాకృష్ణ గ్రామంలో సుమారు 300 ఎకరాల రియల్ ఎస్టేట్ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన రూ.1,500 కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. ఒక్క వేల్పూరులో ఇలా ఉంటే మొత్తం నియోజకవర్గంలో ఎంత అవినీతి చేసి దోచుకున్నారో ప్రజలు గ్రహించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే వినీతి చిట్టా తన వద్ద ఉందన్నారు. ఈ గ్రామంలో 2009లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే వంతెలు, రోడ్లు, కమ్యూనిటీ హాళ్లకు స్థలాలు ఇచ్చానన్నారు. బైపాస్ రోడ్డుకు కూడా తాను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాతనే కాంట్రాక్టర్లకు సొమ్ములు చెల్లించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలో వున్న రూ.3 కోట్లతో రూ.1 కోటి 50 లక్షలతో శెట్టి బలిజ, అగ్నికుల క్షత్రియ, రజక, నాయీ బ్రాహ్మణ, తాపీ మేస్త్రీలు, టైలర్స్‌కు కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలంటే గ్రామ పంచాయితీ సర్పంచ్‌ను అడ్డుపెట్టుకుని నిధులు రాకుండా కోర్టులో కేసులు వేసి బీసీలను వేధిస్తున్నారని చెప్పారు. టీడీఆర్ బాండ్లలో అవినీతి జరిగిందని విమర్శించే టీడీపీ నాయకులు వేల్పూరులో రియల్ ఎస్టేట్‌లో ఆరిమిల్లి రాధాకృష్ణ, అతని అనుచరులు చేసిన అవినీతిని చర్చించేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. గ్రామంలో రైస్ మిల్లర్లు ప్రజల నుంచి అప్పులు తీసుకుని ఎగవేస్తే టీడీపీ నాయకులు వాటిని వసూలు చేసి ప్రజలకు చెల్లించారా? అని ప్రశ్నించారు. గత ఏడు రోజులుగా వేల్పూరులో రిలే దీక్షలు చేస్తున్న బీసీ నాయకులకు సంఘీభావం తెలిపి వారికి ఇమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య, రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ పెండ్రా వీరన్న, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, జిల్లా ఎస్సీ సెల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు, పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మత్స రామరాజు, తణుకు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జక్కంశెట్టి సత్య రాజేంద్ర ప్రసాద్, పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై నిరసనల హోరు



మణిపూర్ ఘటనలపై ఏలూరు జిల్లాలో నిరసనల జోరు కొనసాగుతోంది. గురువారం పలు సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్

టి.నరసాపురం: టి.నరసాపురంలో శాంతి ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న క్రైస్తవులు



ముసునూరు : ముసునూరులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ఫెలోషిప్ ప్రతినిధులు

అనుమతికి మించి పొగాకు పండించొద్దు

జంగారెడ్డిగూడెం : పొగాకు రైతులు అనుమతికి మించిన పంట పండించడం వల్ల ఇబ్బందులు వస్తాయని ఎస్ఎల్ఎస్ రీజియన్ మేనేజర్ ఆదిశేషయ్య సూచించారు. పొగాకు బోర్డు జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1లో గురువారం ఆయన రైతులతో సమావేశం అయ్యారు. వేలం నిర్వహణాధికారి శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆదిశేషయ్య మాట్లాడుతూ ప్రస్తుతం పొగాకు అధిక ధరలను చూసి రైతులు ఎక్కువగా సాగు చెయ్యడం కుదరదన్నారు. ఈ ఏడాది కురిసిన అకాల వర్షాలకు, వడగళ్ల వానకు పొగాకు రైతులు పంట నష్టపోగా, పొగాకు బోర్డు 35 క్వింటాల కన్నా అధికంగా పండించిన పొగాకును అపరాధ రుసుము లేకుండా ఆ పంటను కొనుగోలు చేస్తునట్లు తెలిపారు. వేలం అధికారి శ్రీహరి మాట్లాడుతూ ఈ సంవత్సరం అధిక ధరలను చూసి పొలాలను, బ్యారన్‌లను అధిక రేటుకు కౌలుకు తీసుకుని రైతులు నష్టపోరాదని సూచించారు. వచ్చే ఏడాది ఇలాంటి మార్కెట్ ఉంటుందని చెప్పలేమన్నారు. రాబోయే సీజన్‌కు గాను ఒక్కొక్క బ్యారనుకు 35 క్వింటాళ్లను బోర్డు అనుమతించగా, దానికి మించి పొగాకు పండించి అనధికార బ్యారనులు నిర్మించిన రైతులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ సుధీర్, పొగాకు రైతు సంఘం నాయకులు గడ్డమణుగు సత్యనారాయణ, కరాటం రెడ్డిబాబు, గద్దే లక్ష్మణరావు, వీరభద్రరావు, పిన్నమనేని రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రంలో రైతుల సమావేశంలో మాట్లాడుతున్న పొగాకు బోర్డు ఆర్ఎం ఆదిశేషయ్య

తోటి విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తించొద్దు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యువత విద్యార్థి దశలో వికృత చేష్టలకు పోకుండా సహచర విద్యార్థులతో సోదర, స్నేహభావంతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జీ రాజేశ్వరి హితవు పలికారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఆగస్టు మొదటి, రెండో వారాలలో జిల్లా వ్యాప్తంగా ప్రొఫెషనల్ కాలేజీల్లో ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా గురువారం వట్లూరులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో కళాశాల సిబ్బందికి, యాజమాన్యానికి, విద్యార్థులకు ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించామన్నారు. తోటి విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తించే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. ప్యానల్ లాయర్లు కే.కృష్ణారావు, తిగిరిపల్లి సుబ్బారావు, డాక్టర్ వంశీకృష్ణ, సోషల్ వర్కర్ ఎల్. వెంకటేశ్వరరావు, కళాశాల కరస్పాండెంట్ హరి రామకృష్ణంరాజు, ప్రిన్సిపాల్ కే. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేశ్వరి

విద్యార్థినిని కొట్టిన ఉపాధ్యాయుడిపై కేసు

ఆగిరిపల్లి (నూజివీడు): మండలంలోని ఈదులగూడెం ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి విద్యార్థినిని గత నెల 31న కొట్టిన ఉపాధ్యాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసిన పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు. విద్యార్థిని గూబపై ఉపాధ్యాయుడు గట్టిగా కొట్టడంతో చెవి వినబడటం లేదని విద్యార్థిని ఇంట్లో తల్లిదండ్రులు చెప్పగా, వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్సై తావిర్యా నాయక్ కేసు నమోదు చేసి, విద్యార్థినిని చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యుల సూచనలతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దొంగ అరెస్టు

ఏలూరు టౌన్: ఏలూరు శ్రీరామ్‌నగర్ 12 రోడ్డులో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన దొంగను ఏలూరు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ ఆధ్వర్యంలో ఎస్ఐ శంకర్ గురువారం అరెస్టు చేశారు. శ్రీరామ్‌నగర్ 12వ రోడ్డులో నివాసం ఉంటున్న కమతం వంశీకృష్ణ ఇంటిలో నెల కిత్రం చోరీ జరిగింది. తాళాలు పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించి చోరీ చేసిన కేసులో నిందితుడిగా ఉన్న పాత నేరస్తుడు మచిలీపట్నంకు చెందిన శొంఠి దుర్గారావును త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి విలువైన వాచీ, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. దుర్గారావుపై గతంలో 60కి పైగా చోరీ కేసులు ఉన్నట్లు చెబుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గడపగడపకు సంక్షేమం


ఉంగుటూరు : కైకరంలో గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ కుటుంబానికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు


పోలవరం రూరల్ : ఎల్ఎన్‌డీపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు బ్రోచర్లు అందించి సంక్షేమ పథకాలను వివరిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

విమాన టికెట్ల పేరుతో మోసం

ఏలూరు టౌన్ : కుటుంబ సభ్యులతో కలిసి విదేశానికి వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో విమానం టికెట్లు కొనుగోలు చేసి మోసపోయిన ఓ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. వివరాలిలా ఉన్నాయి. వట్లూరుకు చెందిన సత్తినపల్లి వినయ్‌కుమార్ తన కుటుంబంతో మలేషియా టూర్ ప్లాన్ చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసేందుకు జూలై 30న ఓ వెబ్‌సైట్‌లో పరిశీలించగా, ఆఫర్‌లో టికెట్లు ప్రకటన చూసి ఆ లింకును క్లిక్ చేశారు. ఐదు టికెట్లకు రూ.76వేల134లను ఆన్‌లైన్‌లో చెల్లించారు. ఎంతకీ టికెట్లు రాకపోవటంతో ఆరా తీయగా తాము మోసపోయామని గుర్తించారు. గురువారం రాత్రి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ ఆధ్వర్యంలో ఎస్ఐ శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.